డ్రోన్ల కలకలంపై విచారణ చేపట్టాం: ఏసీపీ

యాచారం, సెప్టెంబరు 16 : మండలంలోని చింతపట్ల, మొండిగౌరెల్లి, మేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద గ్రామాలలో కొన్ని రోజులుగా రాత్రివేళ డ్రోన్లు ఎగరడంపై ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఈమేరకు ఆయన 'ఆంధ్రజ్యోతి' డ్రోన్ల కలకలంపై వివరణ కోరగా.. ప్రజలు ఆందోళన చెందవద్దని, దీనిపై డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ అధికారులతో మాట్లాడనున్నట్లు చెప్పారు. ఫార్మాసిటీ కోసం సర్వే చేస్తే రాత్రివేళనే డ్రోన్లు ఎందుకు గ్రామాలపై ఎగురుతున్నాయని ప్రస్తావించడంతో డీజీసీఏ అధికారులతో సంప్రదించనున్నట్లు ఏసీపీ తెలిపారు.



మిషన్ భగీరథ పైప్‌లైన్ వాల్వ్ ధ్వంసం కావడంతో విరజిమ్ముతున్న నీరు

ఇది ఫౌంటెన్ కాదు.. మిషన్ భగీరథ నీరు!

ఈ ఫొటోలను చూడగానే ఇది వాటర్ ఫౌంటెనో.. లేక వాటర్ గేమో అనుకుంటున్నారు కదా. అలా అనుకుంటే మీరు తప్పులో కాలేసినట్టే. మీరనుకుంటున్నట్టు ఇవేమీ కావు. ఓ టిప్పర్ మిషన్ భగీరథ పైప్‌లైన్ ఎయిర్‌వాల్వ్‌ను ఢీకొట్టడంతో అది పగిలి విరజిమ్ముతున్న నీరు. కొందుర్గు మండల కేంద్రం నుంచి పరిగికి వెళ్తున్న మిషన్ భగీరథ పైప్‌లైన్ ఎయిర్‌వాల్వ్‌ను సోమవారం మధ్యాహ్నం టిప్పర్ ఢీకొట్టింది. దీంతో పైప్‌లైన్ పగిలిపోయి నీరు షాద్‌నగర్-పరిగి రోడ్డుపై ఎగిసి పడింది. దాదాపు రెండు గంటల పాటు నీరు రోడ్డుపై వృథాగా పోయింది. ఈ విషయాన్ని కమ్మదనంలోని స్థానికులు మిషన్ భగీరథ సిబ్బందికి తెలుపడంతో వారు కొందుర్గు నుంచి పరిగి వెళ్లే నీటి సరఫరాను నిలిపివేశారు.

- కొందుర్గు, సెప్టెంబరు, 16



షాద్‌నగర్-పరిగి రోడ్డుపై ఎగిసిపడుతున్న మిషన్ భగీరథ నీరు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

ప్రజాపాలన దినోత్సవానికి ఏర్పాట్లు

హాజరు కానున్న సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబర్ 16 : తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి హాజరు కానున్నారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా నేడు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పట్టణ, గ్రామీణ, స్థానిక సంస్థల్లోనూ మువ్వన్నెల జెండాను ఎగురవేయనున్నారు. ఇందుకు సంబంధించి కలెక్టరేట్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏర్పాట్లను సోమవారం కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ పరిశీలించారు. వేడుకల ఏర్పాట్లలో ఎలాంటి పొరపాట్లూ జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ ఈ వేడుకల్లో వేం నరేందర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు.

నిమజ్జనంలో అపశ్రుతి

- గణేష్ నిమజ్జనం అనంతరం స్విమ్మింగ్‌కు
- నాచులో ఇరుక్కోవడంతో దుర్మరణం
- షాబాద్ మండలంలో ఘటన



ఇబ్రహీం (ఫైల్)

షాబాద్, సెప్టెంబరు 16 : గణేష్ నిమజ్జనంలో పాల్గొన్న ఓ వ్యక్తి చెరువులో ఈతకు వెళ్లి మృతి చెందిన సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. షాబాద్ మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన ఇబ్రహీం(32) ఆదివారం గ్రామస్థులతో కలిసి గణేష్ నిమజ్జనం సందర్భంగా చందన్‌వెల్లి, రుద్రారం గ్రామాల మధ్య ఉన్న చెక్‌డ్యాం వద్దకు వెళ్లాడు. నిమజ్జనం తరువాత ఇబ్రహీం చెక్‌డ్యాంలో ఈత కొట్టాడు. అయితే, నీటిలో ఉన్న నాచులో అతడు ఇరుక్కుపోవడంతో మృతిచెందాడు. ఈక్రమంలో సోమవారం ఉదయం చెక్‌డ్యాం వద్ద శవమై నీటిపై తేలాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని శవాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఇబ్రహీంకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.



ఆరోగ్య బీమా..

వృద్ధులకు భీమా

70 ఏళ్లు దాటిన వారి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు

వయస్సు పెరిగే కొద్దీ ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతూ ఉంటాయి. మారిన జీవన శైలి, తీసుకునే ఆహారం, తగ్గిన శారీరక శ్రమ, పెరిగిన మానసిక ఒత్తిళ్లతో చిన్న వయస్సులోనే వ్యాధులు చుట్టుముడుతున్నాయి. ఇప్పటి వరకు కేంద్రం ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన కొన్నివర్గాల ప్రజలకు మాత్రమే ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకం అందుబాటులో ఉంచింది. తాజాగా దానిని 70 ఏళ్లకు పైబడిన వారందరికీ పేద, ధనిక అనే తేడా లేకుండా వైద్యం కోసం ప్రత్యేక బీమా కల్పించాలని నిర్ణయించింది. ఆదాయంతో సంబంధం లేకుండా వృద్ధులందరూ ఈ పథకం ద్వారా రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా పొందనున్నారు. దీంతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 2,84,350 మంది వృద్ధులకు ప్రయోజనం కలగనుంది.

- ఉమ్మడి జిల్లాలో 2.84లక్షల మందికి ప్రయోజనం
- ఏటా రూ.5లక్షల విలువ గల వైద్య సేవలు ఉచితం
- నూతన పథకానికి ఆమోదముద్ర వేసిన కేంద్ర మంత్రివర్గం

రంగారెడ్డి అర్బన్/వికారాబాద్/మేడ్చల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పేద, ధనిక తారతమ్యం లేకుండా 70 ఏళ్ల పైబడిన వారందరికీ రూ. 5లక్షల ఉచిత వార్షిక ఆరోగ్య బీమా సదుపాయాన్ని కల్పించాలని తాజాగా కేంద్రం తీసుకున్న నిర్ణయంతో ఉమ్మడి జిల్లాలో 2.84లక్షల మంది వృద్ధులకు ప్రయోజనం కలగనుంది. ఈ పథకం ద్వారా పేద, ధనికులనే తేడా లేకుండా అన్ని సామాజిక వర్గాల వృద్ధులకు ఆరోగ్య బీమా వర్తించనుంది. ఈ మేరకు నాలుగు రోజుల క్రితం కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ పథకం అమలుపై ఆమోద ముద్ర వేసింది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న దేశ ప్రజల ఆరోగ్య సంరక్షణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం 2018 నుంచి ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఆయుష్మాన్ భారత్ ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.5 లక్షల వరకు, రాష్ట్ర ప్రభుత్వం రూ.10లక్షల వరకు ఒక్కో కుటుంబానికి ఖర్చు చేస్తున్నాయి. తాజాగా కేంద్ర మంత్రివర్గం 70 ఏళ్లకు పైబడిన వారందరికీ పేద, ధనిక అనే తేడా లేకుండా వైద్యం కోసం ప్రత్యేక బీమా కల్పించాలని నిర్ణయించింది. ఆదాయంతో సంబంధం లేకుండా వృద్ధులందరూ ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకం ద్వారా రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా పొందనున్నారు. ఇప్పటి వరకు ఈ పథకం ఆర్థికంగా వెనకబడిన కొన్నివర్గాల ప్రజలకు మాత్రమే అందుబాటులో ఉంది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో ఆదాయంతో సంబంధం లేకుండా 70 ఏళ్ల పైబడిన పేద, ధనిక వృద్ధులందరికీ కుటుంబం ఆధారంగా రూ.5 లక్షల ఆరోగ్య బీమా వర్తించనుంది. ప్రైవేట్ ఆరోగ్య బీమాలో ఉన్నా వారికి కూడా ఈ పథకం వర్తించనుంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం, ఎక్స్ సర్వీస్‌మెన్ కాంట్రిబ్యూటరీ హెల్త్ స్కీమ్ వంటి ఇతర పథకాల ద్వారా ఆరోగ్య సేవలు పొందుతున్న వారు ఆ పథకాల్లోనే కొనసాగవచ్చు లేదా ఆయుష్మాన్ భారత్‌ను ఎంచుకునే అవకాశం ఉండనుంది. రాష్ట్ర ప్రభుత్వ బీమా పథకాలు పొందే వారికి వాటితో సంబంధం లేకుండా ఈ పథకం వర్తించనున్నట్లు చెబుతున్నారు. ఈ పథకంలో నమోదయ్యే 70 ఏళ్లకు పైబడిన వారందరికీ కొత్తగా కార్డులు జారీ చేయనున్నారు.

70 ఏళ్లకు పైబడిన వారు

జిల్లా	సంఖ్య
రంగారెడ్డి	1,82,099
మేడ్చల్	59,251
వికారాబాద్	42,736

సరైన అవగాహన కల్పిస్తేనే ప్రయోజనం...

కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకం విధి విధానాలపై ప్రజల్లో స్పష్టమైన అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దేశ వ్యాప్తంగా ఆయుష్మాన్ భారత్ పథకం అమలవుతున్నా.. దీనికి అర్హులు ఎవరనేది ప్రజలకు సరైన అవగాహన లేదనేది అందరికీ తెలిసిందే. తాజాగా ఎలాంటి ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా 70ఏళ్ల పైబడిన వారందరికీ ఈ పథకం వర్తింపజేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో దరఖాస్తు చేసుకునే విధానం, బీమా పొందే విధానం, ఏయే ఆసుపత్రుల్లో ఏయే వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయనే విషయంపై వృద్ధులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

2.84లక్షల మంది వృద్ధులకు లబ్ధి

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన రూ.5 లక్షల ఉచిత వార్షిక ఆరోగ్య బీమా పథకం ద్వారా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 2,84,350 మందికి లబ్ధిచేకూరనుంది., ఇందులో రంగారెడ్డిజిల్లాలో 1,82,099 మంది వృద్ధులకు వికారాబాద్ జిల్లాలో సుమారు 42,736 మందికి మేడ్చల్ జిల్లాలో 59,251 మంది వృద్ధులకు ప్రయోజనం చేకూరనుంది. వికారాబాద్ జిల్లాలో అత్యధికంగా పరిగి నియోజకవర్గంలో 12,053 మంది ఉండగా, వికారాబాద్ నియోజకవర్గం పరిధిలో 10,628 మంది ఉన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో 10,509 మంది ఉండగా, తాండూరు నియోజకవర్గం పరిధిలో 9,541 మంది ఉన్నారు. మేడ్చల్ జిల్లాలో 59,251 మంది వృద్ధులకు ప్రయోజనం చేకూరనుంది.

కుటుంబం ఆధారంగా...

మారిన జీవన శైలి, తీసుకునే ఆహారం, తగ్గిన శారీరక శ్రమ, పెరిగిన మానసిక వత్తిళ్లతో చిన్న వయస్సులోనే వ్యాధులు చుట్టుముడుతున్నాయి. వృద్ధాప్యంలోనైతే ఈ సమస్యలు మరీ అధికంగా వెంటాడుతుంటాయి. ఇతర ఖర్చుల కంటే వైద్యానికి చేసే ఖర్చులే ఎక్కువగా ఉంటున్నాయి. 40 ఏళ్లకు పైబడిన వారిలో ఎంతో మంది డయాబెటిక్, బ్లడ్ ప్రెషర్, కిడ్నీలు, లివర్, హార్ట్, పెరాలసిస్, న్యూరో సంబంధిత వ్యాధులు, మోకాళ్లు, కీళ్ల నొప్పులు వంటి అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. పేద ప్రజలు మెరుగైన వైద్య సహాయానికి నోచుకోవడం లేదు. అనారోగ్య సమస్యలతో బాధపడే పేద ప్రజల్లో చాలా వరకు ఆర్థిక ఇబ్బందులతో పేరొందిన కార్పొరేట్ ఆసుపత్రుల వైపు వెళ్లడం లేదు. రాజీవ్ ఆరోగ్యశ్రీ కార్డులు చెల్లుబాటయ్యే ఆసుపత్రుల్లోనే చేరుతున్నారు. కార్డు పరిధిలోకి రాని వైద్యానికి అదనంగా లక్షలాది రూపాయలు చెల్లింపులు చేసే ఆర్థిక పరిస్థితి కూడా పేద ప్రజలకు లేదనేది అందరికీ తెలిసిందే. ఈ పథకం ద్వారా ఒక కుటుంబంలో 70 ఏళ్ల పైబడిన వారు ఒక్కరు ఉంటే రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా వర్తిస్తుంది. అదే ఇద్దరు ఉంటే ఆ ఇద్దరికీ రూ.2.50 లక్షల వంతున బీమా సదుపాయం లభించనుంది. ఒక కుటుంబంలో 70 ఏళ్లకు పైబడిన వారు ఎంత మంది ఉంటే అంత మందికీ రూ.5 లక్షల బీమా సమానంగా వర్తించనుంది.

గణేశ్ నిమజ్జనానికి

44 చెరువులు రెడీ

- అంతా సిద్ధం చేసిన అధికారులు
- కోలాటాలు, విచిత్ర వేషధారణలతో ప్రదర్శనలకు భక్తులు సిద్ధం
- అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు



షాబాద్ మండలం పహిల్వాన్ చెరువు వద్ద నిమజ్జనానికి జరుగుతున్న ఏర్పాట్లు

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 16 : జిల్లాలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు అధికారులు 44 చెరువులను ఎంపిక చేశారు. ఈ చెరువుల వద్ద అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తును కూడా పటిష్ఠం చేశారు. నిమజ్జనం సందర్భంగా ఉత్సాహంగా, ఘనంగా ర్యాలీలను నిర్వహించేందుకు వినాయక మండపాల కమిటీలు కళారూపాలు, కోలాటాలు, నృత్యం, విచిత్ర వేషధారణలతో సంసిద్ధమయ్యాయి. నవరాత్రి పూజలందుకున్న గణనాథులు నిమజ్జనానికి సిద్ధమయ్యారు. ఎప్పటిలాగే ఈ యేడాది కూడా జిల్లాలో వేల సంఖ్యలో వినాయకులను ప్రతిష్ఠించారు. గంగమ్మ ఒడిలోకి గణనాథులను తరలించేందుకు అధికారులు జిల్లాలో 44 చెరువులను గుర్తించారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో సుమారు 560 వినాయక మండపాలను ఏర్పాటు చేశారు. షాద్‌నగర్ ప్రాంతంలోని బొబ్బిలి చెరువు, దూసకల్ చెరువు, కొత్తూరు మండలంలోని కాశన్నకుంట చెరువు, చౌదరిగూడ మండలంలోని పెద్దచెరువు, గుర్రంపల్లి, పెద్దఎల్కిచర్ల, ఇంద్రానగర్ చెరువు, నందిగామ మండలంలోని అప్పారెడ్డిగూడ చెరువు వద్ద ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా మహబూబ్‌నగర్ జిల్లాలోని బిజినేపల్లి, శ్రీశైలం ప్రాజెక్టులో గణపతులను నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల్లో 500కు పైగా వినాయక మండపాలు ఏర్పాటు చేసి గణపతులను ప్రతిష్ఠించారు. కాగా, సగం వరకు సోమవారం నిమజ్జనం చేయగా.. మిగతా వినాయకులను నేడు ఆమనగల్లులోని సురసముద్రం చెరువులో నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గంలో సుమారు 1,500కు పైగా వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. చేవెళ్ల మండల కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి పుష్కరిణిలో బొజ్జ గణపయ్యలను నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. షాబాద్ మండలంలోని పహిల్వాన్ చెరువు, చందనవెల్లి చెరువు, శంకర్‌పల్లి మండలం, మొయినాబాద్ మండలంలోని వినాయకులను జంట జలాశయాలైన గండిపేట, హిమాయత్‌సాగర్‌లో వేసేందుకు సర్వం సిద్ధం చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 2,500 వినాయక మండపాలను ఏర్పాటు చేశారు. ఇబ్రహీంపట్నంలోని మున్సిపాలిలోని శేరిగూడ, తట్టిఖానా చెక్‌డ్యాంలో, మహేశ్వరంలో 3,500 వరకు విగ్రహాలను ఏర్పాటుచేశారు. రావిర్యాల చెరువు, తక్కుగూడ చెరువు, కేసీ తండా, మంత్రాల చెరువులో నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఒక్కో చెరువు వద్ద పదిమంది వరకు పోలీసులను బందోబస్తుకు పెట్టారు. పెద్ద చెరువులు ఉన్నచోట 20 మంది వరకు పోలీసులను కేటాయించారు. విగ్రహాల నిమజ్జన ప్రాంతాల్లో అధికారులు విద్యుత్ లైట్లు, బారికేడ్లు, ప్రతీ చెరువు వద్ద క్రేన్లు అందుబాటులో ఉంచారు. పారిశుధ్య సేవలందించేందుకు ప్రత్యేకంగా కార్మికులను నియమించారు. భక్తులు ఎక్కడా ఇబ్బంది పడకుండా శోభాయాత్ర సాగే ప్రాంతాల్లో సమస్యలు రాకుండా సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్‌లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వినాయక నిమజ్జనంలో డీజేలు నిషేధించడంతో నిర్వాహకులు కోలాటాలు, వివిధ వేషధారణలు, సాంస్కృతిక ప్రదర్శనలకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేసుకున్నారు.



చాదర్లు, పూలు తలపై పెట్టుకుని దర్గాకు తరలివెళ్తున్న ముస్లింలు

ఘనంగా మిలాద్-ఉన్-నబీ

కొత్తూర్, సెప్టెంబరు 16: హజ్రత్ జహంగీర్‌పీర్ దర్గా వద్ద మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని ముస్లింలు మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దర్గా ఆవరణలో గల నియాజ్‌ఖానా యజమానుల ఆధ్వర్యంలో భక్తులు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పత్యాలు ఇచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం నాయకులు మహ్మద్ పవక్త బోధనలను చదివి వినిపించారు.

కుక్కల దాడిలో 30 గొర్రెల మృతి

కొందుర్గు, సెప్టెంబరు, 16: గొర్రెల మందపై కుక్కలు దాడి చేసి 30 గొర్రెలను చంపాయి. ఈ సంఘటన మండల కేంద్రంలో జరిగింది. ఎల్లంపల్లి శ్రీశైలం తన 70 గొర్రెలను గ్రామ శివారులో మంద పెట్టి చుట్టూ జాలి కట్టాడు. ఆదివారం రాత్రి మందలోకి కుక్కలువెళ్లి గొర్రెలను పీక్కు తిన్నాయి. మొత్తం 30గొర్రెలు చనిపోయాయి. ఒక్కో గొర్రె 18వేలకు అమ్ముడయ్యేదని, తనకు 5 లక్షల నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని శ్రీశైలం కోరాడు. కాగా గొర్రెలను మాజీ వైస్ఎంపీపీ రాజేష్ పటేల్ పరిశీలించారు. గతంలోనూ కుక్కలు 10మందిని కరిచాయని, కుక్కల బెడద నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. శ్రీశైలానికి ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలని కోరారు.



కుక్కల దాడిలో మరణించిన గొర్రెలు

నవ భారత నిర్మాణంలో భాగస్వాములవ్వాలి

కీసర, సెప్టెంబరు 16: ప్రధాని మోదీ ఆధ్వర్యంలో నవభారత నిర్మాణంలో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలని బీజేపీ మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి అన్నారు. కీసరలోని అమరవీరుల స్థూపం వద్ద సోమవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. విక్రమ్ మాట్లాడుతూ మోదీ ఆధ్వర్యంలో విద్య, వైద్యం, రైతాంగంతో పాటు అన్ని రంగాలు అభివృద్ధి సాధిస్తున్నాయన్నారు. మండలాధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులు బాపురెడ్డి, బాల్‌రాజ్ యాదవ్, కన్వీనర్ కొలిచెలిమి కృష్ణ తదితరులున్నారు.


మాట్లాడుతున్న పటోళ్ల విక్రమ్ రెడ్డి

'ప్రజలను వంచనకు గురి చేసిన కాంగ్రెస్'

ఆమనగల్లు, సెప్టెంబరు 16: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో ప్రజలను వంచనకు గురి చేసిందని బీజేపీ కల్వకుర్తి నియోజకవర్గ కో-కన్వీనర్ గోరటి నర్సింహ, బీజేవైఎం జిల్లా కార్యదర్శి వగ్గు ప్రభాకర్, బీజేపీ జిల్లా నాయకుడు గుంపెని శ్రీనివాస్‌లు ఆరోపించారు. హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పోలెపల్లిలో సోమవారం బీజేపీ కార్యకర్తల సమావేశం, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు హాజరై నాయకులతో కలిసి సభ్యత్వ నమోదును ప్రారంభించారు. నాయకులు కేతావత్ పత్య, చిన్న లాలయ్య, వెంకటయ్య, రవీందర్, అంజయ్య, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో రోడ్డుకు మరమ్మతులు

మొయినాబాద్ రూరల్, సెప్టెంబరు 16 : కనకమామిడిలోని హనుమాన్ ఆలయం నుంచి హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి వరకు రోడ్డు గుంతలమయంగా మారింది. సోమవారం గ్రామానికి చెందిన మర్రి రవీందర్‌రెడ్డి, వంశీ శ్రమదానం చేయడమే కాకుండా రూ.20వేలతో మొరం తెప్పించి రోడ్డును చదును చేశారు. వంశీచందర్ రెడ్డి, గోవింద్, నిరంజన్‌రెడ్డి, హరిందర్, సురేష్, రాజు పాల్గొన్నారు.

బస్టాండ్ విస్తరణ పనుల్లో వేగం పెంచాలి

చేవెళ్ల, సెప్టెంబరు 16 : చేవెళ్ల ఆర్టీసీ బస్‌స్టాండ్ విస్తరణ పనులు వేగవంతం చేయాలని మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి అధికారులకు సూచించారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్‌స్టాండ్ విస్తరణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బస్‌స్టాండ్ ఆధునికరణకు హెచ్‌ఎండీఏ నుంచి రూ.3కోట్లు మంజూరు చేయించామన్నారు. పనులు చివరి దశకు చేరుకున్నాయని చెప్పారు. పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు వసంతం, ఎం.కృష్టారెడ్డి, మల్లారెడ్డి, సాయికుమార్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, దయాకర్ పాల్గొన్నారు.


పనులు పరిశీలిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

మంచి పనులకు చిరస్థాయి కీర్తి

కడ్తాల్, సెప్టెంబరు 16: ప్రతి ఒక్కరు ఉన్నంతలో పరులకు సాయమందించి జీవితాన్ని సార్థకం చేసుకోవాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డిలు అన్నారు. జీవిత కాలంలో చేసిన మంచి పనులు మరణానంతరం కూడా ప్రజల్లో కీర్తించబడుతాయన్నారు. మండల కేంద్రానికి చెందిన పీఏసీఎస్ మాజీ డైరెక్టర్, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి గూడూరు కేశవ రెడ్డి సంస్మరణ సభ సోమవారం స్థానిక గార్డెన్‌లో నిర్వహించారు. కసిరెడ్డి, వంశీ, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరై కేశవ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలు, మంచితనాన్ని కొనియాడారు. గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, జయేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి,మల్లారెడ్డి, నరేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, పాండు రంగారెడ్డి, గూడూరు భాస్కర్‌రెడ్డి, చందోజీ, యాట నర్సింహ, రంగారెడ్డి, లక్ష్మారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జగన్, జహంగీర్‌అలీ, వేణుగోపాల్, జహంగీర్‌బాబా, యాదగిరిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వర స్వామి సేవలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

కీసర, సెప్టెంబరు 16: తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలిశెట్టి లక్ష్మీనారాయణ సోమవారం కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ మేరకు ఆలయ ఈవో సుధాకర్‌రెడ్డి, చైర్మన్ నాగలింగంశర్మ, అర్చకులు ప్రధానన్యాయమూర్తికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆనంతరం ఆయన గర్భాలయంలోని మూల విరాట్‌కు శ్రీ మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించి తమ మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు ఆయనకు స్వామివారి తీర్థప్రసాదాలు, ఆశీర్వచనాలు అందజేశారు.


ఆలయంలో న్యాయమూర్తి లక్ష్మీనారాయణ

నిమజ్జనం వేళ అప్రమత్తంగా ఉండాలి



రాంపల్లి పెద్ద చెరువు వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

కీసర రూరల్, సెప్టెంబరు 16 : నిమజ్జన ప్రక్రియ నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా సూచించారు. సోమవారం నాగారం మున్సిపాలిటీ రాంపల్లి పెద్దచెరువును ఆమె సందర్శించారు. గణపతి విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత అనుభవాలను పరిగణలోకి తీసుకొని వినాయకుల నిమజ్జన ప్రక్రియ విజయవతమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి అపశృతులకు తావివ్వకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుద్దీపాల ఏర్పాటు, వాహనాల పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్, సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పడిపోతున్న బీజేపీ గ్రాఫ్

● ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి



మైసిగండిలో పర్యటిస్తున్న వంశీచంద్‌రెడ్డి

కడ్తాల్, సెప్టెంబరు 16: దేశంలో బీజేపీ గ్రాఫ్ పడిపోతోందని ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యుసీ సభ్యుడు చల్లా వంశీచంద్ రెడ్డి అన్నారు. కేంద్రం ప్రభుత్వం మత రాజకీయాలు సాగిస్తూ ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతోందని ఆరోపించారు. కడ్తాల మండల కేంద్రంతో పాటు మైసిగండిలో సోమవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి వంశీచంద్ పర్యటించారు. పలు కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన్ను నాయకులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ప్రభుత్వ పథకాల అమలు తీరు, పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. అనంతరం మాట్లాడుతూ మహారాష్ట్ర, జార్ఖండ్, హర్యానా, జమ్మూకశ్మీర్‌లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని, 2029 ఎన్నికల్లో రాహుల్ నేతృత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ కుట్ర రాజకీయాలు వీడి అభివృద్ధిలో ప్రభుత్వంతో కలిసి రావాలని వంశీ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని, పథకాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకుపోవాలని, రేవంత్‌రెడ్డి సహకారంతో కల్వకుర్తి నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, జిల్లా నాయకులు హన్మనాయక్, గుజ్జల మహేశ్, గూడూరు భాస్కర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, చందోజీ, జహంగీర్‌అలీ, కాంగ్రెస్ మండలాధ్యక్షులు బీచ్యానాయక్, జగన్, డోకూరు ప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, మాజీ ఎంపీటీసీ గురిగళ్ల లక్ష్మయ్య, జహంగీర్‌బాబా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఎస్‌జీఎఫ్
జోనల్ స్థాయి సెలక్షన్లు

బషీరాబాద్, సెప్టెంబరు 16: రేపటి నుంచి 28 వరకు మండల కేంద్రంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జోనల్ స్థాయి సెలక్షన్లు నిర్వహించనున్నట్లు తాండూరు ఎస్‌జీఎఫ్ జోనల్ సెక్రెటరీ జె.అంబదాస్ ప్రకటనలో తెలిపారు. బషీరాబాద్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాల(బాలురు) ఆవరణలో తాండూరు, బషీరాబాద్, యాలాల మండలాలకు చెందిన అండర్-14, అండర్-17 బాలబాలికలకు వివిధ క్రీడలపై ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందన్నారు. హాజరయ్యే విద్యార్థులు వయసు ధ్రువీకరణ, తరగతి బోనఫైడ్ సర్టిఫికెట్ తీసుకురావాలన్నారు. సెలక్షన్లకు కింది తేదీలవారీగా హాజరుకావాలన్నారు. 18న అండర్-17 బాలురు, బాలికలకు క్రికెట్, 19న అండర్-14 బాలురు, బాలికలకు క్రికెట్, 20, 21న అండర్-14, 17 బాలురు, బాలికలకు ఖోఖో, 23న అండర్-17 బాలురు, బాలికలకు వాలీబాల్ సెలక్షన్లు, 24న అండర్-14, 25న అండర్-17 బాలురు, బాలికలకు కబడ్డీ, 26న 100, 200, 400, 600 మీటర్ల పరుగు, షాట్‌పుట్, జావెలెన్, డిస్క్ త్రోలు, 27న 800, 1500, 3000, మీటర్ల పరుగు, లాంగ్, హై, ట్రిపుల్ జంప్‌లపై బాలురు, బాలికల ఎంపిక జరుగుతాయని తెలిపారు. అదేవిధంగా 18, 19న అండర్-14, 17 విభాగాల్లో బాలురు, బాలికలకు జరిగే క్రికెట్ టోర్నీకి మాత్రం తాండూరు మండలం మల్‌రెడ్డిపల్లిలోని హనుమాన్ ఫంక్షన్‌హాల్ పక్కన క్రికెట్ కోచింగ్ అకాడమీలో ఎంపిక ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

నేడు విశ్వకర్మ భగవానుడి జయంతి

● ఖాంజాపూర్ గేటు గుట్ట వద్ద యజ్ఞ మహోత్సవం



తాండూరు, సెప్టెంబరు 16: పరంజ్యోతి స్వరూపుడగు విశ్వకర్మ భాగవానుడు విశ్వ సృష్టికర్త భగవానుడు విశ్వ సృష్టికర్తగా పిలుపబుడుతారు. ఐదు అవతరాలుగా ఐదు గురు బ్రహ్మర్షులుగా ఉద్భవించినారని చరిత్రలో ఉంది. సానగ, సనాతన, అహభూవన, ప్రత్నస్య, సువర్ణ బ్రహ్మర్షులుగా పిలువబడుతారు. సమాజంలో విశ్వకర్మల సేవలు అద్భుతమని, వారి సేవలు సమాజంలో ప్రతీఒక్క ఇంటికి చేరుతాయని విశ్వాసం. కాగా, మంగళవారం (నేడు) హైదరాబాద్ రోడ్డు మార్గం ఖాంజాపూర్ గేటు గుట్టపై తాండూరు నియోజకవర్గ విశ్వబ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే విశ్వకర్మ జయంతి మహోత్సవానికి విశ్వకర్మ పంచాదాయ వృత్తుల వారు సకుటుంబంగా తరలిరావాలని నిర్వాహకులు కోరారు. పూజలు, హోమాల అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

తూంకుంటలో రాజీవ్ రహదారి సెట్‌బ్యాక్ తగ్గించాలి

● ఎమ్మెల్యే మల్లారెడ్డికి బాధితుల మొర



మల్లారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న బాధితులు

శామీర్‌పేట, సెప్టెంబరు 16 : తూంకుంట పరిధిలో గల రాజీవ్ రహదారి ఆరు లేన్ల విస్తరణలో రోడ్డు సెట్‌బ్యాక్, కటింగ్‌ను తగ్గించి పేదల నష్టాన్ని నివారించేందుకు చర్యలను తీసుకోవాలని బాధితులు ఎమ్మెల్యే మల్లారెడ్డికి మొరపెట్టుకున్నారు. సోమవారం తూంకుంట మున్సిపల్ బీజేపీ యువ నాయకుడు కాసుల సుభాష్‌గౌడ్ ఆధ్వర్యంలో రాజీవ్‌రహదారి రోడ్డు వెడల్పులో ఇళ్లు కోల్పోతున్న బాధితులు ఎమ్మెల్యేను కలసి వినతిపత్రం అందజేసి గోడును వెళ్లబోసుకున్నారు. ఆరులేన్ల విస్తరణలో భాగంగా అత్యధికంగా 200 ఫీట్ల మేర అధికారులు సర్వే మార్కింగ్ చేశారని, 100 ఫీట్లకు తగ్గించేందుకు తగిన చర్యలను తీసుకోవాలని మల్లారెడ్డికి విన్నవించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

పరిగి,సెప్టెంబరు 16: వాహనదారులు ఎంతటివారైనా సరే నిబంధనలకు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పరిగి సీఐ ఎన్.శ్రీనివాస్ అన్నారు. పరిగి పోలీసులు సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న పలు వాహనాలను సీజ్‌చేసి, వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎస్ఐ సంతోష్, ఏఎస్ఐ కృష్ణ, సిబ్బంది ఉన్నారు.

తాండూరు రూరల్: మద్యం సేవించి వాహనాలు నడపరాదని కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలో సోమవారం ఏఎస్ఐ పవన్‌కుమార్‌తో కలిసి వాహనాలు తనిఖీ నిర్వహించారు. తనిఖీలో భాగంగా నెంబర్ ప్లేట్లు లేని వాహనాలకు నెంబర్ ప్లేట్లు తగిలించారు.

మోమిన్‌పేట్: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఎస్సై అరవింద్ వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ హెల్మెట్, సీటు బెల్టు, వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను కలిగి ఉండాలని సూచించారు. మైనర్‌లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబుకు కాంగ్రెస్ నాయకుల సన్మానం



మంత్రిని సన్మానిస్తున్న హరివర్ధన్‌రెడ్డి, వజ్రేష్‌యాదవ్, నాయకులు

శామీర్‌పేట, సెప్టెంబరు 16 : ఐటీ మంత్రి శ్రీధర్‌బాబును సోమవారం శామీర్‌పేట మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. మంత్రి సోమవారం కొల్తూర్ పరిధిలోని ఐకేపీ నాలెడ్జ్ పార్కులో గల నూతన లారస్ ల్యాబ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వెళ్తూ శామీర్‌పేట వద్ద గల ఎన్‌పీజీ వెంచర్‌లోని కన్వెన్షన్ హాల్‌కు విచ్చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబుకు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వైఎస్ గౌడ్ ఆధ్వర్యంలో డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, హజ్‌కమిటీ రాష్ట్ర నాయకుడు ముజీబుద్దీన్, తూంకుంట మున్సిపల్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, మండలం నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికి అభినందించి పూలమాలలు వేసి సన్మానించారు.

పాముకాటుకు రైతు మృతి



యాదయ్య (ఫైల్)

కొందుర్గు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : పాము కాటుతో రైతు మృతి చెందిన సంఘటన రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లిలో జరిగింది. గ్రామస్థుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పసుపుల యాదయ్య (43) ఆదివారం సాయంత్రం ఆగిర్యాలలో ఇటీవల కొనుగోలు చేసిన పొలం వద్దకు వెళ్లాడు. పొలం గెట్టుపై నుంచి వెళ్తుండగా పాము కాటు వేసింది. దాంతో తోటి రైతులు షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా.. చికిత్సపొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతు డు యాదయ్యకు భార్య దుర్గమ్మ, ఇద్దరు కూతుళ్లు, కుమారుడున్నారు.

జీతాలు మాకెందుకివ్వరు?

● అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆక్రోశం
● పెట్రోల్ బాటిల్‌తో ఇద్దరు కార్మికుల నిరసన
● ఐదేళ్లుగా పని చేస్తున్నా జీతం ఇవ్వారా అంటూ ఆగ్రహం



మున్సిపల్ కార్యాలయం వద్ద పెట్రోల్ బాటిల్‌తో నిరసన తెలుపుతున్న కార్మికులు నర్సిములు, జ్యోతి

తాండూరు, సెప్టెంబరు 16: మాతో కలిసి పని చేసే కార్మికులకు జీతాలు ఇస్తున్నారు.. మేము కూడా పని చేస్తున్నాం కదా.. మరి ఎందుకు జీతాలు ఇవ్వడం లేదని ఇద్దరు మున్సిపల్ కార్మికులు పెట్రోల్ బాటిల్‌తో నిరసన తెలిపారు. సోమవారం తాండూరు మున్సిపాలిటీలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులు నర్సిములు, జ్యోతిలు తమకు జీతాలు ఇవ్వాలంటూ మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. ఐదు సంవత్సరాలుగా మున్సిపాలిటీలో పనులు చేయించుకుంటున్నారని, మాతో పాటు పనిచేసిన 9 మందికి జీతాలు ఇచ్చారని, మాకు మాత్ర ఎందుకు ఇవ్వడం లేదని మీడియా ఎదుట వాపోయారు. అధికారులు జీతం ఇస్తామని హామీ ఇచ్చేవరకూ ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించారు. న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని పెట్రోల్ బాటిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. కమిషనర్ విక్రమ సింహారెడ్డి వచ్చి కార్మికులను సముదాయించే యత్నం చేయగా.. మాకు అన్యాయం చేస్తున్నారంటూ వాగ్వాదానికి దిగారు. కాగా, ఇంతకుముందు పనిచేసిన కమిషనర్.. కలెక్టర్ వద్ద తీసుకొచ్చిన అప్రూవల్‌లో నర్సిములు, జ్యోతి పేర్లు లేవని, ఇప్పుడేమీ చేయలేమని కమిషనర్ వివరించారు. ఫైల్‌ను పరిశీలిస్తానని కార్మికులకు హామీ ఇచ్చారు. దాంతో కార్మికులు నిరసనను విరమించారు. అనంతరం నర్సిహులు మీడియాతో మాట్లాడుతూ ఐదుళ్లుగా పని చేస్తున్నామని, మాతో పాటు పనిచేసిన 9 మందికి జీతాలు వేశారు. మాకు వేయమంటే మీ పేర్లు లేవని చెబుతున్నారు. మా ఇద్దరి పేర్లు ఎందుకు లేవని ప్రశ్నించారు. ఏడాదిగా జీతం డబ్బుల గురించి అడిగితే.. ఈ సార్ వద్దకు.. ఆ సార్ వద్దకు పొమ్మంటూ తిప్పించుకుంటున్నారని వాపోయాడు. అదేవిధంగా జ్యోతి మాట్లాడుతూ 9 మంది కార్మికులకు జీతాలు వేసిన అధికారులు మా ఇద్దరిని పట్టించుకోవడం లేదని తెలిపింది. తాము కూడా వాళ్లలాగే ఐదేళ్లుగా పని చేస్తున్నామని, మేం ఏం పాపం చేశామని వాపోయింది. కలెక్టర్ సార్ వద్దకు వెళ్తే సంతకం చేసి మున్సిపల్ ఆఫీసుకు పంపించారని, తీర్మానంలో కూడా మా పేర్లు ఉన్నాయని తెలిపింది. మాకు న్యాయం జరిగేవరకూ పోరాడుతూనే ఉంటామని చెప్పింది.

రాత్రివేళ 'సరుకుల' పంపిణీ

● గొట్టిగకలాన్‌లో రేషన్ డీలర్ ఇష్టారాజ్యం
● చీకట్లోనే నిత్యవసరాలు తీసుకెళ్తున్న ప్రజలు
● విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం : తహసీల్దార్



రాత్రివేళ రేషన్ బియ్యంతో చీకట్లో వెళ్తున్న యువతి, రేషన్ దుకాణం నుంచి చీకట్లో బియ్యం మూటతో వెళ్తున్న వృద్ధుడు

బషీరాబాద్, సెప్టెంబరు 16: మండలంలోని గొట్టిగకలాన్ రేషన్ డీలర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీనెల రేషన్ బియ్యం రాత్రి వేళల్లో పంపిణీ చేస్తుండటంతో ముఖ్యంగా మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో డీలర్ వద్దకు వెళ్లి బియ్యం మూటలు తీసుకెళ్లేందుకు నానా ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్థానికులు ఆగ్రహం వెళ్లగక్కుతున్నారు. డీలర్ ప్రైవేటు ఉద్యోగం చేయడంతోనే రాత్రివేళ రేషన్ సరకులు పంపిణీ చేస్తున్నారని స్థానికుడు కొత్తూరు రాములు ఆరోపించాడు. నిబంధనల ప్రకారం ఉదయం, సాయంత్రం రేషన్ దుకాణం తెరిచి ఉంచి సరుకులు పంపిణీ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై బషీరాబాద్ తహసీల్దార్ వెంకటేష్‌ను వివరణ కోరగా.. తన దృష్టికి రాలేదన్నారు. నిబంధనల ప్రకారం రేషన్ పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. డీలర్‌పై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటానని ఆయన వెల్లడించారు.

తక్రారి భూమి వద్ద దళిత రైతు ఆత్మహత్యాయత్నం

● సర్దిచెప్పిన రెవెన్యూ, పోలీసు, మార్కెటింగ్ శాఖ పాలకవర్గం ప్రతినిధులు
● రైతులకు మరో చోట భూమి కేటాయింపు
● పంచనామా నిర్వహించిన రెవెన్యూ అధికారులు



పురుగుల మందు తాగేందుకు యత్నిస్తున్న రాజును వారిస్తున్న పోలీసు, రైతుల నుంచి తీసుకున్న భూమికి పంచనామా నిర్వహిస్తున్న ఆర్ఐ గోపి

తాండూరు రూరల్, సెప్టెంబరు 16: తక్రారి భూమి వద్ద ఓరైతు పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా తాండూరు మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే. తాండూరు-యాలాల మండలాలకు సంబంధించి రైతులకు మార్కెటింగ్ శాఖ సేవలను మరింత విస్తరించేందుకు యాలాల మండలం బషీర్‌మియాతండాలోని సర్వేనెంబర్-64లో 29 ఎకరాల 38 గుంటల భూమిని మార్కెటింగ్ శాఖ కోసం కేటాయించారు. అయితే అందులో ముగ్గురు గిరిజన రైతులు రుక్మీబాయి 4ఎకరాల 32గుంటలు, కె. రవి 3ఎకరాలు, వి.రమేష్‌కు ఎకరా, వి.రవికి ఎకరా, లక్ష్మీబాయికి చెందిన ఎకరా భూమిని భూమిని రెవెన్యూ అధికారులు మార్కెటింగ్‌శాఖ గోదాం కోసం తీసుకున్నారు. అయితే వారికి బదులుగా వేరే చోట భూమిని ఇవ్వాలని కొన్ని రోజులుగా డిమాండ్ బాధితులు డిమాండ్ చేశారు. దీంతో అంతారం గ్రామ శివారులోని సర్వేనెంబర్-11 లోని కొంత మేరకు అప్పట్లో మిగిలిపోయిన 8ఎకరాల తక్రారి(సర్వే నెంబర్ లేని భూమి) భూమి ని కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇట్టి భూమిపై కొంతకాలం క్రితం రెవెన్యూ, మున్సిపాల్, మార్కెటింగ్ శాఖ అధికారులు పరిశీలించి సర్వే నిర్వహించారు. తక్రారి భూమిలో అంతారం గ్రామానికి చెందిన దళిత రైతు కుటుంబీకులు డప్పు రాజు, దేవమ్మ, శ్రీనివాస్ 8 ఎకరాల్లో ప్రస్తుతం సాగులో ఉన్నారు. అయితే ఇట్టి భూమిని బషీర్‌మియా తండాలో భూమిని తీసుకునేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా సోమవారం పెద్దేముల్ మాజీ జెడ్పీటీసీ ధారాసింగ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, డైరెక్టర్లు అజ్మత్ అలీ, ఉదయ భాస్కర్‌రెడ్డి, జర్నప్ప, ఆసీం, కరీం, రాజుతోపాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గోపి, మండల సర్వేయర్ మహేష్ ఆధ్వర్యంలో రైతులకు కేటాయించేందుకు పంచనామా నిర్వహించారు. దీంతో దళిత రైతు డప్పురాజు తమకు అన్యాయం చేస్తున్నారని, పురాతన కాలం నుంచి తమ పెద్దలు సాగు చేసుకుంటున్న భూమిని ప్రభుత్వం లాక్కోవడం ఎంతవరకు సమంజసమన్నారు. తక్రారి భూమికి సర్వేనెంబర్ ఉండదని, అట్టి భూమిని నిజాం కాలం నుంచి తమ పూర్వీకులు సాగు చేస్తుంటే రెవెన్యూ అధికారులు వచ్చి లాక్కోవడం సరికాదని రాజు వాపోయారు. అసలు ఈ భూమిని ఏ ఆధారాల ద్వారా రెవెన్యూ అధికారులు లాక్కుంటారు? అని ప్రశ్నించారు. తమకు న్యాయం చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటానంటూ పురుగుల మందు డబ్బా పట్టుకునే ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. దీంతో వెంటనే అక్కడే ఉన్న కానిస్టేబుల్ రాజు వద్ద నుంచి పురుగుల మందు డబ్బాను లాక్కుని సముదాయించారు. దీంతో మాజీ జెడ్పీటీసీ ధారాసింగ్ పేద కుటుంబానికి న్యాయం చేయాలని తెలపడంతో రెవెన్యూ అధికారులు తక్రారి భూమిలోనే రైతులు తుకారాం, కడవత్ శివరాం, గోప్యానాయక్, నక్కల పుల్లయ్య, బుర్రపెంటప్ప, సంగమ్మలకు పంచనామా నిర్వహించి వారి అభిప్రాయం మేరకే 5ఎకరాల 30గుంటల భూమిని సర్దుబాటు చేసినట్లు సర్వేయర్ ప్రకాష్, ఆర్ఐ గోపి తెలిపారు. ఏఎంసీ డైరెక్టర్ల సమక్షంలోనే రైతులకు సముదాయించి సమస్య పరిష్కరించేందుకు కొంత భూమిని కేటాయించడం జరిగిందని ఏఎంసీ డైరెక్టర్ అజ్మత్ అలీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాహు లక్ష్మీకాంత్, రైతులు శ్రీనివాస్, కానిస్టేబుళ్లు తదితరులు ఉన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించండి



మంత్రి ఉత్తమ్‌కు వినతిపత్రం ఇస్తున్న శంకర్

షాద్‌నగర్, సెప్టెంబరు 16: నియోజకవర్గ పరిధిలో నీటి పారుదల రంగంతో పాటు మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో ఆయన్ను కలిసిన అనంతరం మాట్లాడుతూ షాద్‌నగర్ నియోజకవర్గంలోని 9 చెక్‌డ్యాంల నిర్మాణం కోసం రూ. 20.68కోట్లు, మండలాల్లో ఉన్న 17 చెరువుల వద్ద మౌలిక సదుపాయాల ఏర్పాట్లు, నిర్మాణ వ్యయం పనుల కోసం మొత్తంగా రూ.47.98 కోట్ల నిధులు కేటాయించాలని మంత్రికి ప్రతిపాదనలు అందజేసినట్లు ఎమ్మెల్యే శంకర్ పేర్కొన్నారు.

దుద్యాల్‌లో ఐటీఐ, జూనియర్ కళాశాల,
పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి



నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 16: ప్రభుత్వం దుద్యాల మండల పరిధిలోని హకీంపేట్‌లో ఐటీఐ, జూనియర్ కళాశాల, పీహెచ్‌సీని ఏర్పాటు చేసేందుకు జీవో జారీ చేయడం సరైంది కాదని, అన్ని ప్రభుత్వ కార్యాలయాలను దుద్యాల మండల కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో ఆందోళన నిర్వహిస్తామని బీర్ఎస్ నాయకులు అన్నారు. ఈమేరకు నాయకులు నరేశ్‌గౌడ్, చంద్రయ్య, రాములు, రమేశ్, రాములు తదితరులు సోమవారం దుద్యాల పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. బసిరెడ్డి, అహ్మద్‌పాషా, నర్సిములుగౌడ్, రాజు, అఫ్సర్, శాంతు, పెంటయ్య, రవినాయక్, గోపాల్ నాయక్, శివప్ప, అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న యాదయ్య

నవాబుపేట, సెప్టెంబరు 16: మండలంలోని చించల్‌పేట్ మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి భార్య యాదమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులున్నారు.

పేదలందకీ సంక్షేమ పథకాలు

మంచాల, సెప్టెంబరు 16: నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తుందని మాజీ ఎంపీపీ కె.శ్రీనివాస్‌నాయక్ పేర్కొన్నాడు. మంచాల మండలం లోయపల్లిలో సోమవారం సబ్సిడీ గ్యాస్, గృహజ్యోతి పథకాల లబ్ధిదారులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణలో ప్రజాపాలనకు అడుగులు పడుతున్నాయని వెల్లడించారు. కాంగ్రెస్ నేతలు చెరుకుగణేష్, బి.వెంకటేష్, ఎన్. లింగయ్య, భీముడు పాల్గొన్నారు.

విద్యార్థులు బాగా చదివి
గొప్ప స్థాయికి ఎదగాలి



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న అధ్యాపకులు

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 16 : ఎంబీఏ విద్యార్థులు బాగా చదివి వ్యాపార రంగంలో గొప్ప స్థాయికి ఎదగాలని మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలాజికల్ డైరెక్టర్ వీఎస్‌కే రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ ఎమ్మార్‌సెట్ కళాశాలలో ఎంబీఏ పూర్తి చేసుకుంటున్న విద్యార్థులకు సోమవారం జూనియర్లు ఫ్రెషర్స్ డే పార్టీ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వీఎస్‌కే రెడ్డి మాట్లాడుతూ ఎంబీఏ చదివే విద్యార్థులు వ్యాపార రంగంపై పట్టు సాధించాలన్నారు. నేడు ప్రతీ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. విద్యార్థులు వాటికి తగ్గట్టు ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాలని సూచించారు. కార్యక్రమంల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శ్రీనివాస రావు, డీన్ డాక్టర్ వేణుగోపాల్, ఏవో ప్రొఫెసర్ రాజేశ్వర్ రెడ్డి, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ జి.నవీన్‌కుమార్ తదితరులున్నారు.

సీఎంను కలిసిన
2008 డీఎస్సీ మెరిట్ అభ్యర్థులు



సీఎంతో 2008 డీఎస్సీ మెరిట్ జాబితా అభ్యర్థులు

మోమిన్‌పేట్, సెప్టెంబరు 16: మండలానికి చెందిన 2008 డీఎస్సీలో మెరిట్ లిస్టులో ఉన్న అభ్యర్థులు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. హైదరాబాద్‌లో సీఎం కార్యాలయంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. తమకు పోస్టింగ్ ఇప్పించాలని కోరారు. సీఎం సానుకూలంగా స్పందించి విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వెంకటేశంను కలవాలని సూచించారు. అనూష, సుధాకర్, సంధ్య, మంజుల, కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

దౌల్తాబాద్: గ్రామపంచాయతీల్లో వేసిన సీసీరోడ్లకు సంబంధించి పెండింగ్ బిల్లులు అందించాలని మాజీ సర్పంచ్‌లు సీఎంను కోరారు. హైదరాబాద్‌లో రేవంత్‌రెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. నూతనంగా ఏర్పాటుచేసిన తిరుమలాపూర్ జీపీలో బంగ్లా తండాను కలిపారని తండావాసులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకట్రావ్, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు. అలాగే అల్లాపూర్‌నకు చెందిన హోంగార్డు వి.కృష్ణయాదవ్ గతేడాది డిసెంబరు 3న బొంరాస్‌పేట్ మండలంలోని తుంకిమెట్ల సమీపంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా బాధిత కుటుంబసభ్యులు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కుటుంబానికి అండగా ఉంటామని సీఎం వారికి భరోసా ఇచ్చారు.

శుద్ధ తాగునీటితో సంపూర్ణ ఆరోగ్యం

తలకొండపల్లి, సెప్టెంబరు 16: శుద్ధ తాగునీరు సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడుతుందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పకడల్ గ్రామంలో నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటుకు సోమవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. స్థానికుల కోరిక మేరకు సొంత డబ్బు వెచ్చించి నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటుకు ముందుకు వచ్చిన ప్రభాకర్ రెడ్డిని గ్రామస్తులు సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు జోగు రమేష్, రమేశ యాదవ్, శ్రీశైలం యాదవ్, తిరుపతిరెడ్డి, నర్సింహ్మా, రమేష్, పెద్దయ్య, తిరుపతయ్యగౌడ్, రామస్వామి, గౌస్, రమేష్, ఖలీల్, సత్తయ్య, విజయ్‌కుమార్, చందు, రామచంద్రుడు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



నీటి శుద్ధి కేంద్రం పనులు ప్రారంభిస్తున్న డోకూరు ప్రభాకర్‌రెడ్డి

ఘనంగా గణనాథుల నిమజ్జనాలు

● లడ్డూల వేలం పాటలు ● మండపాల వద్ద అన్నదానాలు


యాచారం: కుర్మిద్దలో నిమజ్జనానికి తరలుతున్న గణపతి

యాచారం/కందుకూరు/మాడ్గుల/మంచాల/శంషాబాద్ రూరల్/చేవెళ్ల/షాద్‌నగర్ అర్బన్/చౌదరిగూడ/కొత్తూర్/మొయినాబాద్ రూరల్/ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి/ఇబ్రహీంపట్నం/కేశంపేట, సెప్టెంబరు 16: యాచారం మండలంలోని కుర్మిద్ద, గడ్డమల్లాయగూడ, గున్‌గల్, మీర్‌ఖాన్‌పేట గ్రామాల్లో సోమవారం గణ నాథులను నిమజ్జనానికి తరలించారు. విద్యార్థులు, మహిళలు కోలాటం ఆడి అలరించారు. కుర్మిద్దలో వీరారెడ్డి స్వామివారి లడ్డూను రూ.30వేలకు దక్కించుకున్నారు. కందుకూరు మండల గ్రామాల్లో గణేష్ మండపాల వద్ద పూజలు కొనసాగుతున్నాయి. లేమూరులో హనుమాన్ ఆలయం వద్ద గణపతి హోమం నిర్వహించారు. కందుకూరులోని చెన్నకేశవాలయం వద్ద ఏర్పాటు చేసిన గణపతిని ఆదివారం రాత్రి నిమజ్జనం చేశారు. లడ్డూను సురసాని రాంరెడ్డి రూ.1.08లక్షలకు దక్కించుకున్నారు. నవతరం యూత్ సభ్యులు గణనాథుడిని నిమజ్జనం చేశారు. జి.కొండల్‌రెడ్డి, డి.బాలక్రిష్ణ, సాయికిరణ్, టి.ఆకాశ్‌రెడ్డి, భరత్‌రెడ్డి, సాత్వికొరెడ్డి, ప్రశాంత్‌మార్, వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, తాళ్ల కార్తీక్, దీక్షిత్‌రెడ్డి, ప్రశాంత్ కుమార్, టి.వినోద్‌చారి పాల్గొన్నారు. మాడ్గుల హనుమాన్ ఆలయంలో ఫ్రెండ్స్ యూత్ నెలకొల్పిన వినాయకుడికి పూజల అనంతరం నిమజ్జనానికి శ్రీశైలం తరలించారు. లడ్డూను సూదిని ప్రశాంత్‌రెడ్డి రూ.1,22,116లకు దక్కించుకున్నారు. ఉత్సవాల్లో శ్రావణ్‌రెడ్డి, శరత్‌రెడ్డి, భరత్‌రెడ్డి, నారాయణ, కొండల్‌రెడ్డి, పట్టాభి నారాయణరెడ్డి, ఆంజనేయులు, గోవింద్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, మతిధుకర్, ప్రభాకర్‌రెడ్డి, శివ, రామకృష్ణారెడ్డి, శేఖర్, పాండు పాల్గొన్నారు. మంచాల మండల గ్రామాల్లో గణేష్ మండపాల వద్ద చివరి రోజు అన్నదానాలు నిర్వహించారు. ఆరుట్ల చండీశ్వర యూత్ వినాయకుడిని లడ్డూను కొరె రాణి-సురేష్ దంపతులు రూ.61వేలకు పాడారు. జాపాల హనుమాన్ ఆలయం వద్ద అన్నదానంలో సీఐ బబ్యానాయక్ పాల్గొన్నారు. శంషాబాద్ మండలం నర్కూడ, కవ్వగూడ, చౌదరిగూడ గ్రామాల్లో వినాయక మండపాల వద్ద బీఆర్ఎస్ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి పూజలు నిర్వహించారు. మల్కారం ప్యాక్స్ చైర్మన్ బుర్కుంట సతీష్ అధ్వర్యంలో పూజల్లో పాల్గొన్నారు. కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం కళ్లు తెరవాలని, అభివృద్ధిని గాలికొద్దిలారని విమర్శించారు. కార్యక్రమంలో శివాజీ, రాజేందర్, వెంకట్‌రెడ్డి, భాస్కర్, రమేష్, బి.మహేష్, నీరటి కృష్ణ, అశోక్, మురళి పాల్గొన్నారు. చేవెళ్ల మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి చేవెళ్లలోని రచ్చబండ వినాయకుడిని దర్శించుకున్నారు. నిర్వాహకులు ఆయన్ను సన్మానించారు. అలాగే నాయకులతో కలిసి ముందస్తుగానే తన పుట్టినరోజు వేడుకను నిర్వహించుకొని మండపం వద్ద కేక్ కట్ చేశారు. చేవెళ్లలోని అంబేడ్కర్ కాలనీ గణేశ్ లడ్డూ రూ.5.51లక్షలకు బుర్హాన్ బ్రదర్స్ దక్కించుకున్నారు. ఇదే కాలనీలో మరో గణేశ్ లడ్డూను పొట్ట రమేశ్, గంగి శివకుమార్, యాదయ్య కలిసి రూ.3.25లక్షలకు దక్కించున్నారు. రజక నగర్‌లో లడ్డూను వై.శివకుమార్ రూ.4లక్షలకు దక్కించుకున్నారు. మల్లికార్జుననగర్ కాలనీలో రూ.3.11లక్షలకు గాల రెస్టారెంట్ నిర్వాహకుడు దక్కించుకున్నారు. రంగారెడ్డి కాలనీ లడ్డూ రూ.2.5లక్షలకు పద్మబాబు, లింగారెడ్డి దక్కించుకున్నారు. హౌసింగ్ బోర్డు కాలనీకి వినాయక లడ్డూను సురక్ష టీమ్ సభ్యులు రూ. 4.71లక్షలకు దక్కించుకున్నారు. సాయిక్రిష్ణకాలనీ లడ్డూను కాలానికి శంకరయ్య రూ.2లక్షలకు సొంతం చేసుకున్నారు. భగత్‌సింగ్ కాలనీ గణేశ్ లడ్డూ రూ.1.75లక్షలకు శ్రీనివాస్, శివశంకర్, నవీన్‌కుమార్‌లు దక్కించుకున్నారు. ముడిమ్యాల్‌లోని లడ్డూను హరికిషన్‌రెడ్డి రూ.12.16లక్షలకు దక్కించుకున్నారు. షాద్‌నగర్‌లో వినాయక లడ్డూల వేలం పోటాపోటీగా జరుగుతోంది. ఐదు, తొమ్మిదో రోజున కొన్ని వినాయకులను నిమజ్జనం చేశారు. మిలిగిన విగ్రహాలను 11వ, 13వ రోజున నిమజ్జనం చేస్తారు. షాద్‌నగర్ ఆనంద్‌కాలనీ పార్క్ వినాయకుడి రెండు లడ్డూలను మనోజ్‌కుమార్-కీర్తన దంపతులు 5.35లక్షలకు దక్కించుకున్నారు. ఏటీ విల్లాస్‌లో పెద్ద లడ్డూను వేముల్‌నర్వ రాజశేఖర్ 3.51లక్షలకు, చిన్న లడ్డూను 1.51లక్షలకు దయాకర్‌రెడ్డి, కలశాన్ని 2లక్షలకు శివ దక్కించుకున్నారు. శంకర్‌నగర్ కాలనీ విఘ్నేశ్వరుడి ప్రసాదాన్ని మంచన్‌పల్లి రమేష్ దంపతులు 1.45లక్షలకు, ప్రశాంత్‌నగర్ కాలనీ లడ్డూను 1.11 లక్షలకు సాయిప్రసాద్‌రెడ్డి దక్కించుకున్నారు. రైతు కాలనీ పెద్ద లడ్డూను 1.56లక్షలకు శుక్లవర్ధన్‌రెడ్డి, చిన్నలడ్డూను 90,300లకు మమ్మిడాడీ గార్మెంట్స్ యజమాని ప్రశాత్ దక్కించుకున్నారు. చౌదరిగూడ మండలం వనంపల్లి, తుమ్మలపల్లి చౌదరిగూడ, రావిర్యాల గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి వరకు మండపాల వద్ద పూజలు చేశారు. లడ్డూ వేలం నిర్వహించి వినాయకులను నిమజ్జనం చేశారు. కొత్తూర్ మండల గ్రామాల్లో నిమజ్జనాలు నిర్వహించారు. యువతీ, యువకుల నృత్యాలు, బాణ సంచా కాలుస్తూ శోభాయాత్ర నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. వినాయ చవితిని అందరూ సంతోషంగా జరుపుకుంటున్నామని మొయినాబాద్ మండల బీజేపీ ఉపాధ్యక్షుడు తూర్పు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అజీజ్‌నగర్‌లోని హనుమాన్ ఆలయంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని నిమజ్జనం చేశారు. వినాయక నిమజ్జనాన్ని ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో నిర్వహించారు. మండపాల ఉదయం పూజలు, మహిళల కుంకుమార్చన, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. నిమజ్జన వేడుకల్లో మహిళల బతుకమ్మ, కోలాట ప్రదర్శనలు, యువతీ యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. సీఐలు ప్రమోద్‌కుమార్, శివప్రసాద్, ఎస్ఐలు వెంకటేశ్, వరప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆమనగల్లు సురసముద్రం చెరువు, ఇతర చెరువుల్లో నిమజ్జనానికి ఏర్పాట్లు చేశారు. కడ్తాల మండలం మైసిగండిలో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో లడ్డూ వేలాన్ని నిర్వహించారు. అంతకు ముందు పూజల్లో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి పాల్గొన్నారు. మైసిగండి గణేశ్ ఉత్సవ కమిటీ బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన పెద్ద వినాయకుడి లడ్డూను రూ.3.5లక్షలకు జటావత్ రమేశ్‌నాయక్ సొంతం చేసుకున్నారు. మైసమ్మ గుడి వద్ద గండి మైసమ్మ వినాయక మండప లడ్డూను రూ.1.2లక్షలకు రామావత్ కల్యాణ్, హనుమాన్‌గుడి లడ్డూను రూ.1.11లక్షలకు రాజారామ్‌నాయక్, మైసిగండి ముత్యాలమ్మగుడి వినాయక లడ్డూను రూ.1.2లక్షలకు శంకర్, దేపావత్ గుడి వద్ద రూ.1.2 లక్షలకు కృష్ణ, ఇస్లావత్ మండపం వద్ద లడ్డూ రూ.1.11లక్షలకు నరేశ్, సభావట్ మండపం వద్ద రూ.1.1లక్షలకు కొర్ర శ్రీను, జాటావత్ మండపం వద్ద రూ.78వేలకు పాండు, దేపావత్ చరణ్ రూ.76వేలకు, అభిషేక్ రూ.66వేలు, ప్రేమజవహర్‌లాల్ రూ.1.32లక్షలకు, జటావత్ గోపి రూ.85వేలు, నర్య రూ.70వేలకు లడ్డూలను కైవశం చేసుకున్నారు. కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ చైర్మన్ హీరానాయక్, నాయకులు కమ్లీమోత్యానాయక్, సిరోలిపంతూ, తులసీరామ్, శేఖర్‌గౌడ్, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, యాట నర్సింహ, హన్మానాయక్, లక్‌పతి, లక్ష్మణ్, జగన్, బిచ్య, ప్రభాకర్‌రెడ్డి, బిక్యనాయక్, జవహర్‌లాల్, రెడ్యా, రాజు, దుద్యా, సక్రి, రాము, పత్యనాయక్, సృజన్, రాందాస్, శంకర్, కిషన్, వినోద్ పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నంలో గణేష్ నవరాత్రోత్సవాలు ముగియగా సోమవారం భక్తులు లడ్డూను వేల ంలో దక్కించుకున్నారు. కర్ణంగూడలో ఆంజనేయ భక్త మండలి ఏర్పాటు చేసిన గణేష్ మండప లడ్డూను ఎంపల్ల వినయ్‌రెడ్డి రూ.1.01లక్షలకు దక్కించుకున్నారు. ఆయన ఆరోసారి లడ్డూను కైవశం చేసుకున్నారు. ఇబ్రహీంపట్నం భాగ్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ గణేష్ లడ్డూను తలకోలు యాదగిరిరెడ్డి రూ.70వేలకు దక్కించుకున్నారు. కేశంపేట మండలం లింగందనలో శ్రీరామయూత్ ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూను గ్రామానికి చెందిన కమ్మదనం సంజీవరెడ్డి రూ.2.48 లక్షలకు దక్కించుకున్నారు. సంగెంలో శ్రీమిత్ర యూత్ వినాయకుడి లడ్డూను రూ.1.11 లక్షలకు చింతలపల్లి బలవంతరెడ్డి దిక్కించుకున్నారు. పోమాల్‌పల్లిలో వేంకటేశ్వరాలయం వద్ద వినాయకుడి లడ్డూను ఈటమోని మహేష్ రూ.40వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమాల్లో రాజేందర్‌రెడ్డి, రాంరెడ్డి, వెంకటేష్‌గౌడ్, వేణుగోపాలచారి, కృష్ణయాదవ్, మహేష్ పాల్గొన్నారు.


షాద్‌నగర్ అర్బన్: అయ్యప్ప కాలనీ వినాయకుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే శంకర్


ఆమనగల్లులో లడ్డూను దక్కించుకున్న గంగ రవి-అనిత దంపతులతో ఉత్సవ కమిటీ సభ్యులు


కర్ణంగూడలో గణేష్ లడ్డూను దక్కించుకున్న వినయ్‌రెడ్డి




కడ్తాల: న్యామతాపూర్ గణేశ్ మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జర్పుల దశరథ్ నాయక్


శంషాబాద్ రూరల్: నర్కూడలో వినాయక మండపంలో పూజలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు కార్తీక్‌రెడ్డి, సతీష్


మొయినాబాద్ రూరల్: అజీజ్‌నగర్‌లో గణేశ్ లడ్డూను వేలంలో దక్కించుకున్న తూర్పు శ్రీనివాస్‌రెడ్డి


కందుకూరులో లడ్డూను కైవసం చేసుకున్న సురసాని రాంరెడ్డి


కొత్తూర్: ఇన్ముల్‌నర్వలో వినాయక నిమజ్జన ఊరేగింపు


మాడ్గులలో లడ్డూను దక్కించుకున్న శ్రావణ్‌రెడ్డితో గ్రామస్తులు

వినాయకుడి లడ్డూను కైవసం చేసుకున్న ముస్లిం యువకుడు



చేవెళ్ల మండలం ఊరెళ్లలో వినాయక లడ్డూ ప్రసాదాన్ని గ్రామానికి చెందిన ముస్లిం యువకుడు మమ్మద్ మొయిన్ రూ.25,000లకు దక్కించుకున్నాడు. మొయిన్ మాట్లాడుతూ.. కుల మతాలకు అతీతంగా వేలంలో లడ్డూను దక్కించుకున్నట్లు చెప్పారు. ఐదేళ్లుగా తన స్నేహితులతో కలిసి లడ్డూను తీసుకుంటున్నట్టు చెప్పాడు. ఈ ఏడాది ఒక్కడినే లడ్డూను కైవశం చేసుకున్నారని తెలిపాడు. అలాగే గుండాలలోని రచ్చబండి వినాయకుడి లడ్డూను గంగిడి జంగారెడ్డి-జెన్నమ్మ దంపతులు రూ.2లక్షలకు దక్కించుకున్నారు.

మండపం సమీపంలోనే మట్టి వినాయకుడి నిమజ్జనం



షాద్‌నగర్: పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకుడిని ఏర్పాటు చేసి, ఆ తర్వాత మండపం సమీపంలోనే నిమజ్జనంతో పర్యావరణ ప్రేమికుల మెప్పు పొందారు.. షాద్‌నగర్‌లోని ప్రశాంత్‌నగర్ గణేష్ మండలి నిర్వాహకులు. వెంకట్‌రెడ్డి, అశోక్, సంజీవరెడ్డి, వెంకట కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలు 8అడుగుల మట్టి వినాయకుడిని ఏర్పాటు చేశారు. 9 రోజుల పూజల అనంతరం ఆదివారం తెల్లవారుజామున 3 గంటలకు భారీ నీటి తొట్టిలో నిమజ్జనం చేశారు.

ఆలయ నిర్మాణానికి రూ.50వేల విరాళం

చేవెళ్ల, సెప్టెంబరు 16: చేవెళ్లలో నిర్మిస్తున్న మల్లన్న ఆలయ నిర్మాణానికి జక్కన్నగారి జైపాల్‌రెడ్డి కుమారు గీత్‌శ్రీనందన్‌రెడ్డి రూ.50వేల విరాళాన్ని సోమవారం ఆలయ కమిటీకి అందజేశారు. అలాగే చేవెళ్లలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు బీరువాలు అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణరావు, గోపాల్‌రెడ్డి, మల్లేష్ ఉన్నారు.

ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరగాలి


ఉపాధ్యాయ సంఘాల నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం, సెప్టెంబరు 16 : ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనూ విద్య అందుతుందనే విశ్వాసం తల్లిదండ్రుల్లో కలిగేలా ఉపాధ్యాయులు పనిచేయాలని, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం తుక్కుగూడలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు తమ సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కేఎల్లార్‌ను కోరారు. వారితో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బడుల్లో సమస్యలను పరిష్కరిస్తుందన్నారు. హాస్టళ్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందిస్తుందన్నారు. టీచర్లు విద్యార్థులకు మంచి విద్యతో పాటు విజ్ఞానం, సంస్కారం నేర్పాలన్నారు. ప్రజల మధ్య ఆర్థిక అసమానతలు తొలగాలన్నా, ఉన్నత జీవితం గడపాలన్నా విద్యతోనే సాధ్యం అన్నారు. గ్రామీణ విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలనుకున్నా అవకాశాల్లేక పది, పన్నెండు తరగతులకే పరిమితం అవుతున్నారన్నారు. ఇక నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యమిస్తూ ఫోర్త్ సిటీలో జాతీయస్థాయి విద్యాలయాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యావకాశాలను గ్రామీణ విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఈ సందర్భంగా సంఘాల నాయకులకు కేఎల్లార్ హామీ ఇచ్చారు.

సంక్షిప్తంగా...

● **షాబాద్:** గ్రామాభివృద్ధికి నిరంతరం కృషిచేస్తున్నట్లు ముద్దెంగూడ మాజీ ఉపసర్పంచ్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం పంచాయతీ అనుబంధ గ్రామం ఎర్రోనిగూడ రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. ఆయన మాట్లాడుతూ- గ్రామాభివృద్ధికి కృషిచేస్తున్నట్లు చెప్పారు.

● **ఆమనగల్లు:** ఏళ్లుగా పార్టీకి సేవలందిస్తున్న తనకు ఆమనగల్లు మార్కెట్ వైస్ చైర్మన్ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. పార్టీ నాయకులకు వినతి పత్రాలిచ్చారు. 2014 నుంచి తాను పార్టీకి పనిచేస్తున్నట్టు తెలిపారు.

● **చేవెళ్ల:** గొల్లగూడలోని హనుమాన్ ఆలయ కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా శంకరయ్య, వైస్‌చైర్మన్ కృష్ణ, సభ్యులు ముకుందంగౌడ్, నరేంద్రగౌడ్, మనోహర్‌గౌడ్, మహేందర్, సత్తయ్య, సత్యనారాయణ,శంకర్, గురుప్రసాద్,శ్రీశైలం, కుమార్, విజయ్‌గౌడ్, భాస్కర్, మహేందర్, శ్రీనివాస్, శశివర్ధన్ ఎంపికయ్యారు.

లైంగికదాడిని అడ్డుకున్న మహిళ గొంతు నులిమి హత్య


హత్య కేసు వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌రావు

కొత్తూర్, సెప్టెంబరు, 16: బలాత్కారాన్ని అడ్డుకున్న మహిళను 60ఏళ్ల వృద్ధుడు గొంతు నులిమి హత్య చేసి జైలుపాలయ్యాడు. పోలీస్‌స్టేషన్‌లో సోమవారం శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌రావు, ఇన్‌స్పెక్టర్ నర్సింహారావుతో కలిసి మహిళ హత్య కేసు వివరాలను వెల్లడించారు. కొత్తూర్ మండలం ఇన్ముల్‌నర్వకు చెందిన మొగిలి యాదమ్మ(45) భర్త గంగయ్య కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. యాదమ్మ తన ఇద్దరు కూతుళ్లతో కొత్తూర్‌కు వలసొచ్చి కూలి చేసుకుంటూ జీవించేది. కూతుళ్ల పెళ్లిళ్లు చేసింది. ఐదేళ్ల క్రితం కొత్తూర్ కూలీ అడ్డాలో ఏపీలోని గుంటూరు జిల్లాకు చెందిన మేస్త్రీ రామారావుతో పరిచయమై ఇద్దరూ కొత్తూర్‌లో సహజీవనం చేస్తున్నారు. ఈ క్రమంలో రామారావుకు ప్రకాశం జిల్లాకు చెందిన పేరం బాబూరావు(60) మేస్త్రీ పరిచయమయ్యాడు. పనికి వెళ్తున్న క్రమంలో యాదమ్మపై కన్నేసిన బాబూరావు ఆమెను లొంగదీసుకోవాలని చూశాడు. ఈ నెల 9న రామారావు తన సొంతూరు వెళ్లాడు. ఇదే అదనుగా భావించిన బాబూరావు 11న యాదమ్మ ఇంటికొచ్చి ఉదయం కల్లు ప్యాకెట్లు ఇచ్చి వెళ్లి, రాత్రి మళ్లీ కల్లు ప్యాకెట్లు, మద్యంతో వచ్చాడు. యాదమ్మకు మద్యం తాగించి ఆమెను అనుభవించేందుకు యత్నించాడు. యాదమ్మ అతడిని అడ్డుకోగా బాబూరావు ఆమె ముఖంపై గుద్ది గొంతు పిసికి చంపి ఆమె సెల్‌ఫోన్‌తో పరారయ్యాడు. హత్యపై యాదమ్మ కూతురు రేణుక ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు దర్యాప్తు చేశారు. సాక్ష్యాలు సేకరించిన బాబూరావు కోసం గాలించారు. అతడు రైల్వేస్టేషన్ రోడ్డులో తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. యాదమ్మను చంపినట్టు బాబూరావు ఒప్పుకున్నాడు. బాబూరావును సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. బాబూరావు అరెస్టుకు కృషిచేసిన ఎస్ఐ జి.శ్రీనివాస్‌రావు, ఏఎస్ఐ శ్రీనివాస్‌చారి, కానిస్టేబుళ్లు రవికుమార్, కుమార్, మహిపాల్, శ్రీనివాస్‌లను ఏసీపీ అభినందించారు.

భార్యాభర్తలపై దాడి చేసిన వ్యక్తులపై కేసు


నిందితులు అరవింద్, ప్రదీప్

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 16: భార్యాభర్తలపై దాడి చేసిన వారిపై కేసు నమోదైన ఘటన సోమవారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... కాచారానికి చెందిన సురేష్, శైలజ భార్యాభర్తలు. వారికి 6నెలల పాప ఉంది. ఊట్‌పల్లిలోని వారి బంధువుల ఇంటికి వచ్చారు. అదే గ్రామానికి చెందిన కుమ్మరి అరవింద్, కుమ్మరి ప్రదీప్, మరో 25 మంది యువకులు వారింటికొచ్చి దళిత అమ్మాయిని ఎలా పెళ్లి చేసుకుంటావని సురేష్‌ను ఇనుప పైపులు, కట్టెలతో కొట్టారు. వారి నుంచి కాపాడేందుకు సురేష్‌ను అతడి బంధువులు ఇంట్లోపెట్టి గడియవేయగా బయట ఉన్న శైలజ, శిశువును ప్రదీప్, అరవింద్‌లు లాక్కెళ్లారు. సురేష్‌ను బయటకు పంపకుంటే శిశువును చంపేస్తామని బెదిరించారు. దీంతో సురేష్ బయటకు రాగానే పైపులు, కర్రలతో చితకబాదారు. సురేష్ తల నుంచి రక్తం కారింది. స్థానికుల సమాచారంతో పోలీసులు చేరుకొని సురేశ్‌ను శంషాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. శైలజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. నిందితులు పరారీలో ఉన్నారని, త్వరలోనే అరెస్టు చేస్తామని సీఐ వివరించారు.

స్వచ్ఛమైన తాగు నీరందిస్తాం


గున్‌గల్ రిజర్వాయర్ వద్ద ఎయిర్ వాల్వ్‌ను పరిశీలిస్తున్న మిషన్‌భగీరథ ఈఈ నర్సింహ

యాచారం, సెప్టెంబరు 16 : ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరందిస్తామని, నీటి కోసం జనం ఇబ్బందులపాలవకుండా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా మిషన్ భగీరథ(గ్రిడ్) ఈఈ నర్సింహ తెలిపారు. సోమవారం ఆయన మిషన్ భగీరథ డీఈ వినయ్, యాచారం మండల ఏఈ ప్రణయ్‌లతో కలిసి ముచ్చర్ల నుంచి గున్‌గల్ రిజర్వాయర్‌కు వస్తున్న నీటి సరఫరా పైప్‌లైన్‌లు, ఎయిర్ వాల్వ్‌లను తనిఖీ చేశారు. మాల్, యాచారం, మంతన్‌గౌరెల్లి, నూన్‌సాఫ్‌తండా, శ్రీమంతగూడ, భానుతండా, కేస్లీతండా, మంతన్‌గౌరెల్లి, నల్లవెల్లి తదితర గ్రామాలలో పర్యటించి పైప్‌లైన్‌లను పరిశీలించారు. ఎయిర్ వాల్వ్‌లు బాగున్నాయా లేదా అని తనిఖీ చేశారు. గ్రామాల్లో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులకు నీరు సక్రమంగా సరఫరా అవుతున్నాయా అని విచారణ చేశారు. పైప్‌లైన్ లీకైనట్లు సమాచారమందిన వెంటనే బాగు చేయించాలని డీఈ, ఏఈలను ఆదేశించారు. దెబ్బతిన్న పైప్‌లైన్లుంటే బాగుచేయించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్వచ్ఛమైన కృష్ణా వాటర్ సరఫరా చేస్తున్నారా అని గ్రామాల్లోని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. భానుతండా, కేస్లీతండా తదితర గ్రామాల్లో నీటి శుద్ధత పై తెలుసుకున్నారు. ముచ్చర్ల నుంచి యాచారం మండలానికి రోజూ 32ఎంఎల్‌డీ నీటిని అందిస్తున్నామని ఈఈ చెప్పారు. దీర్ఘకాలికంగా ముచ్చర్లకు నీటి సరఫరా ఆగిపోతే గున్‌గల్ మెట్రోవాటర్ నుంచి సరఫరా చేస్తామన్నారు.

క్రైం కార్నర్

పందిని ఢీకొని పడి యువకుడి మృతి


సునీల్(ఫైల్)

కందుకూరు, సెప్టెంబరు 16 : బైక్ పందిని ఢీకొనడంతో బైక్‌పై ఉన్న యువకుడు మృతిచెందిన ఘటన కందుకూరులో చోటు చేసుకుంది. స్థానికులు పోలీసులకిచ్చిన సమాచారం మేరకు.. కొత్తూరు మండలం కొడిచర్లతండా(ఖయాజిగూడ)కు చెందిన విస్లావత్ సునిల్(28) సోమవారం ఉదయం బేగరికంచ నుంచి తన గ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. కమలమ్మగడ్డ వద్ద రోడ్డు దాటుతున్న పందిని బైక్ వేగంగా ఢీకొంది. దీంతో సునిల్ నాలుగు మీటర్ల దూరం ఎగిరి రోడ్డు కింద పడ్డాడు. తలకు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో పోలీసులు చేరుకొని సునిల్‌ను 108అంబులెన్స్‌లో శషాబాద్‌లోని ఆర్యన్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సునిల్ కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీతారాం తెలిపారు.

లారీ ఢీకొని వృద్ధుడు దుర్మరణం

షాబాద్, సెప్టెంబర్ 16 : లారీ ఢీకొని వృద్ధుడు మృతిచెందిన సంఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. నాగర్‌గూడకు చెందిన ఎర్రవల్లి లింగయ్య(65) నాగర్‌గూడ చౌరస్తా వద్ద రోడ్డు దాటుతుండగా షాద్‌నగర్ నుంచి వచ్చిన లారీ ఢీకొంది. గాయపడ్డ లింగయ్యను బంధువులు నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. లారీ డ్రైవర్ గోవింద్‌పై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

బైక్-డీసీఎం ఢీ.. ఇద్దరికి గాయాలు

కేశంపేట, సెప్టెంబరు 16: లేమామిడి పంచాయతీ పరిధి గాంధీ శంకర్‌పల్లి సమీపంలో తలకొండపల్లి-కేశంపేట రోడ్డుపై డీసీఎం వ్యాన్, బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. తలకొండపల్లికి చెందిన శ్రీధర్‌చారి(42), కేశంపేటకు చెందిన శివచారి (27) బైక్‌పై కేశంపేటకు వస్తున్నారు. కేశంపేట నుంచి తలకొండపల్లికి వెళ్తున్న డీసీఎం గాంధీశంకర్‌పల్లి సమీపంలో బైక్‌ను ఢీకొట్టింది. శ్రీధర్, శివ గాయపడ్డారు. వారిని 108 అంబులెన్స్‌లో షాద్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. డీసీఎం డ్రైవర్ తలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం. ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు వస్తే దర్యాప్తు చేస్తామని కేశంపేట ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

వాహనం ఢీకొని గాయాలు

కందుకూరు, సెప్టెంబరు 16: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడకు చెందిన తల్లోజు మాధవచారి(56) సోమవారం కడ్తాల్ నుంచి గ్రామానికి బైక్‌పై వస్తుండగా దెబ్బడగూడ గేటు సమీపంలో వాహనం బైక్‌ను వెనుక నుంచి ఢీకొంది. దీంతో మాధవచారి తలకు, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని శంషాబాద్‌లో లిమ్స్ ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీతారాం తెలిపారు.